సాక్షి
పల్నాడు
ఆదివారం । 29 । జూన్ । 2025



జెడ్పీ సీఈవో ఆకస్మిక తనిఖీ

తాడికొండ: తాడికొండలో జెడ్పీ సీఈవో జ్యోతిబసు శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఆయన వెంట ఎంపీడీవో కె సమతావాణి ఉన్నారు.



ఈవీఎం గోడౌన్ పరిశీలన

ఫిరంగిపురం: రేపూడిలోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్‌లో భద్రపరిచిన ఈవీఎంలను ఆర్డీవో కె.శ్రీనివాసరావు శనివారం పరిశీలించారు. తహసీల్దార్ జె.ప్రసాదరావు పాల్గొన్నారు.



అలరించిన తాళం భజన

నగరంపాలెం(గుంటూరు ఈస్ట్): స్థానిక బృందావన్ గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలోని అన్నమయ్య కళావేదిక పై శనివారం తాళం భజన నిర్వహించారు.

చదువు కొనలేం!

గుంటూరు నగరంలోని అరండల్‌పేటకు చెందిన జగదీష్ ఓ ప్రైవేటు కంపెనీలో అకౌంటెంట్‌గా ఉద్యోగం చేస్తున్నాడు. ఇద్దరు పిల్లలను ఓ ప్రైవేటు పాఠశాలలో చేర్పించాడు. ఒకటో తరగతిలో చేర్పించిన బాబుకు రూ.20వేల ఫీజుతో పాటు పుస్తకాల కోసం అదనంగా రూ.4 వేలు, రెండో తరగతిలో చేర్పించిన అమ్మాయికి రూ.22వేల ఫీజుతో పాటు పుస్తకాల కోసం రూ.5వేలు చెల్లించాలని చెప్పడంతో గుండె గుభిల్లుమంది. ప్రభుత్వ పాఠ్య పుస్తకాల వెల ఒక్కో విద్యార్థికి రూ.500లోపే కదా అని జగదీష్ అడిగితే ప్రభుత్వ పుస్తకాలను మార్కెట్లో కొనుక్కోవాలని, తాము సూచించిన వాటిని క్యాంపస్‌లోనే కొనుగోలు చేయాలని పాఠశాల యాజమాన్యం సూచించింది. నెలకు రూ.15వేలు సంపాదిస్తున్న జగదీష్‌కు ఇద్దరు పిల్లలను కార్పొరేట్ పాఠశాలలో చదివించడం భారంగా మారింది. ఇది ఒక్క జగదీష్‌కే పరిమితమైన సమస్య కాదు.. పిల్లలను ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో చదివిస్తున్న తల్లిదండ్రులు పడుతున్న సమస్యలకు ఇది ఒక ఉదాహరణ.

- ఏటా పెరుగుతున్న ఫీజులు
- నలిగిపోతున్న మధ్యతరగతి కుటుంబాలు
- పుస్తకాలు, యూనిఫాం కొనడానికి అప్పులు
- క్యాంపస్‌లలోనే యథేచ్ఛగా ప్రైవేటు పబ్లిషర్ల పుస్తక విక్రయాలు
- ప్రభుత్వ పాఠ్య పుస్తకాలనే బోధించాలనే నిబంధనకు తూట్లు
- ప్రభుత్వ పాఠ్య పుస్తకాల కొనుగోలు తప్పనిసరి చేసిన వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- ఆన్‌లైన్ ఆర్డర్ విధానంతో పక్కాగా పర్యవేక్షణ
- ఆ పద్ధతికి స్వస్తి పలికిన కూటమి ప్రభుత్వం





ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేందుకు వీల్లేదు

ప్రైవేటు పాఠశాలల్లో ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచేందుకు అవకాశం లేదు. పాఠశాల యాజమాన్య కమిటీ తల్లిదండ్రులతో చర్చించి గతేడాది వసూలు చేసిన ఫీజులకు అదనంగా ఐదు శాతమే పెంచాలి. ప్రైవేటు పబ్లిషర్ల పాఠ్య పుస్తకాలను విక్రయించేందుకు అనుమతి లేదు. తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారణ జరిపి, చర్యలు చేపడతాం.
– సీవీ రేణుక, జిల్లా విద్యాశాఖాధికారి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల విద్యా వ్యాపారం జోరుగా సాగుతోంది. తల్లిదండ్రుల నుంచి ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నారు. గతేడాదితో పోల్చితే 20 శాతం నుంచి 30 శాతం మేరకు పెంచేశారు. ప్రైవేటు పాఠశాలలో ఒకటో తరగతికి ఫీజు రూ.18 నుంచి 20 వేల మధ్యలో ఉండగా, కార్పొరేట్ స్కూల్లో అది రూ. 28 వేలుగా ఉంది. కార్పొరేట్ పాఠశాలలో 6వ తరగతికి రూ.35 వేలు, టెన్త్‌కు రూ.40వేలు వసూలు చేస్తున్నారు. ఏసీ క్యాంపస్ పాఠశాలల్లో ఒకటో తరగతికి రూ.60వేలు, టెన్త్‌కు రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారు.

పబ్లిషర్లతో డీల్

ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ పాఠ్య పుస్తకాలను పక్కన పెట్టేశాయి. ప్రైవేటు పబ్లిషర్లతో డీల్ కుదుర్చుకుని, ఎమ్మార్పీలకు ధరలకు పాఠ్య పుస్తకాలు, నోట్సులు విక్రయిస్తున్నాయి. వీటితో పాటు యూనిఫాం, బెల్టు, టై సహా అన్నీ వారి దగ్గరే తల్లిదండ్రులు కొనాలి. మరికొన్ని పాఠశాలలు మార్కెట్లోని వస్త్ర విక్రయ దుకాణదారులతో ఒప్పందం కుదుర్చుకుని, యూనిఫాంను ఫలానా దుకాణంలో కొనుగోలు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులకు సూచిస్తున్నాయి.

నాణ్యమైన విద్య..మిథ్య

ఒకటి నుంచి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర విద్య పరిశోధన, శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) రూపొందించిన పాఠ్యాంశాల బోధన జరిగాలి. అయితే, ఆయా పాఠశాలల యాజమాన్యాలు అనధికార పాఠ్య పుస్తకాలతో తరగతులను నిర్వహిస్తున్నాయి. గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు ఎస్సీఈఆర్టీ పాఠ్య పుస్తకాల ద్వారానే బోధించాలని ప్రభుత్వ నిబంధనలు స్పష్టం చేస్తున్నప్పటికీ, నిబంధనలను గాలికొదిలేసి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి.

కూటమి ప్రభుత్వం తూట్లు

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు బోధన చేస్తున్న పాఠ్యాంశాలనే ప్రైవేటు పాఠశాలల్లోనూ తప్పనిసరి చేస్తూ గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి కూటమి ప్రభుత్వం తూట్లు పొడించింది. ప్రతి ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాల హెచ్‌ఎం, ప్రిన్సిపాల్ లాగిన్ ద్వారా క్యాంపస్‌లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఆన్‌లైన్‌లో పుస్తకాలకు ఆర్డర్ పెట్టాలి. పుస్తకాలను కొనుగోలు చేసే విధానాన్ని విద్యాశాఖాధికారులు పక్కాగా పర్యవేక్షించారు. కూటమి ప్రభుత్వ పాలనలో ఆన్‌లైన్ విధానానికి స్వస్తి పలకడంతో ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలపై పర్యవేక్షణ లోపించింది. గుంటూరు జిల్లా వ్యాప్తంగా ఉన్న 637 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉండగా, అధిక లాభాలను ఆర్జించిపెట్టే ప్రైవేటు పబ్లిషర్ల పుస్తకాలనే విక్రయిస్తున్నారు. ఎస్సీఈఆర్టీ అకడమిక్ కేలండర్‌కు విరుద్ధంగా సొంత సిలబస్ బోధించి, పరీక్షలు నిర్వహించడంతో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందని పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

కేసులు పరిష్కారానికి కృషి చేయండి

13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ



మాట్లాడుతున్న న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ

నరసరావుపేటటౌన్: జూలై ఐదున నిర్వహించనున్న లోక్ అదాలత్‌లో పెద్ద సంఖ్యలో రాజీ మార్గం ద్వారా కేసులను పరిష్కరించేందుకు పోలీస్ అధికారులు కృషి చేయాలని 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తి ఎన్.సత్యశ్రీ అన్నారు. జాతీయ లోక్ అదాలత్‌కు సంబంధించి శనివారం సబ్ డివిజన్‌లోని అన్ని పోలీస్‌స్టేషన్ల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. న్యాయమూర్తి మాట్లాడుతూ సబ్ డివిజన్‌లోని నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ రూరల్ పోలీస్‌స్టేషన్, ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ల పరిధిలోని ప్రతి ఒక్క పోలీస్‌స్టేషన్ అధికారులతో కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ నుంచి ఎన్ని కేసులు రాజీమార్గం ద్వారా పరిష్కరిస్తారని అడిగి తెలుసుకున్నారు. కేసుల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారాలు సూచించారు. పోలీస్ అధికారులు లేవనెత్తిన పలు సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో న్యాయ అధికారులు ఎస్.లావణ్య, ఆర్.ఆశీర్వాదం పాల్, ఎం.గాయత్రి, న్యాయవాద సంఘ అధ్యక్షులు జి.వి.సుబ్బారావు, ఏపీపీ మల్లారెడ్డి, నరసరావుపేట డీఎస్పీ కె.నాగేశ్వరరావు, సీఐలు హైమారావు, ఎం.వి.చరణ్, ప్రభాకర్, రమేష్, లోకనాథం, సబ్ డివిజన్లోని అన్ని పోలీస్‌స్టేషన్ల ఎస్‌ఐలు, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.

ఇన్స్యూరెన్స్ కంపెనీలతో..

ఇదే అంశంపై వివిధ ఇన్స్యూరెన్స్, చిట్‌ఫండ్ కంపెనీల ప్రతినిధులతో కూడా సమీక్ష సమావేశం నిర్వహించారు. కేసుల పరిష్కారానికి సహకరించాలన్నారు.

న్యూస్‌రీల్

ఉద్యోగుల సస్పెన్షన్‌పై విచారణ



నాదెండ్ల: గణపవరం గ్రామీణ పశువైద్యశాల వైద్యాధికారి సాంబశివారెడ్డి, వెటర్నరీ లైవ్ స్టాక్ సిబ్బంది పవన్‌కుమార్ ఇటీవల సస్పెండ్‌కు గురైన విషయం తెలిసిందే. ఈ విషయమై పశు సంవర్ధక శాఖ డైరెక్టర్ దామోదర్‌నాయుడు శనివారం విచారణ చేపట్టారు. ఈ నెల 19న 3.30 గంటల సమయంలో రాష్ట్ర పశుసంవర్ధకశాఖ, పాడి పరిశ్రమల స్పెషల్ చీఫ్ సెక్రటరీ సి రాజశేఖర్ గణపవరం పశువైద్యశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సమయంలో వైద్యాధికారి సాంబశివారెడ్డి, సిబ్బంది పవన్ కుమార్ లేకపోవటంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ సస్పెండ్ చేశారు. ఈ విషయమై శనివారం డైరెక్టర్ దామోదర్‌నాయుడు రికార్డులు పరిశీలించి వివరాలు నమోదు చేసుకున్నారు. స్థానిక పశుపోషకులను విచారించారు. వైద్యాధికారి ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటారని, ఏ సమస్య వచ్చినా స్థానికంగా ఇళ్లకు వచ్చి వైద్యసేవలు అందిస్తున్నారని వివరించారు.

ఆలయ నిర్మాణానికి విరాళం



నరసరావుపేటరూరల్: ఇస్సపాలెంలోని మహంకాళి అమ్మవారి ఆలయ నిర్మాణ పనులకు మేదరమెట్ల అంజమ్మ, మస్తాన్‌రావు విద్యాసంస్థల చైర్మన్ ఎంబీ శేషగిరిరావు, అనంతలక్ష్మీ దంపతులు విరాళంగా రూ.3 లక్షలు అందజేశారు. ఆలయ కార్యాయంలో ఈవో నలబోతు మాధవిదేవిని కలిసి విరాళం చెక్‌ను దాతలు అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు నందూరి కాశీకృష్ణ పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో మెరిట్ కార్డులు

నరసరావుపేట ఈస్ట్: జాతీయ ఉపకార వేతన పరీక్షలో ఎంపికైన 168 మంది విద్యార్థుల మెరిట్ కార్డులు ప్రభుత్వ పరీక్షల కార్యాలయం వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్టు పల్నాడు జిల్లా విద్యాశాఖాధికారి ఎల్.చంద్రకళ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన విద్యార్థులు ఉపకార వేతనం పొందేందుకు వెంటనే బ్యాంక్ ఖాతా తెరిచి తమ ఆధార్‌ను లింక్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రభుత్వ పరీక్షల వెబ్‌సైట్ www.bre.ap.gov.in ద్వారా తమ మెరిట్ కార్డులు డౌన్‌లోడ్ చేసుకొని అన్ని వివరాలను ఒక్క అక్షరం తేడా లేకుండా సరిచూసుకోవాలని తెలిపారు. అనంతరం కేంద్ర మంత్రిత్వశాఖ స్కాలర్‌షిప్ పోర్టల్ www.rchoarrhipr.gov.in నమోదు చేసుకొని దరఖాస్తును అప్‌లోడ్ చేయాలని తెలిపారు. సంబంధిత పాఠశాల నోడల్ ఆఫీసర్, జిల్లా నోడల్ ఆఫీసర్ ద్వారా ధృవపరుచుకోవాలన్నారు. మెరిట్ కార్డులను త్వరలో డిప్యూటీ డీఈఓ కార్యాలయాల ద్వారా పాఠశాలలకు పంపిస్తామని తెలిపారు. కార్డులోని వివరాలను సరిచూసుకొని ఏవైనా పొరపాట్లు ఉన్నట్లయితే ప్రధానోపాధ్యాయుల ద్వారా డీఈఓ కార్యాలయంలో అందచేయాలని వివరించారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో షబీనా ప్రతిభ



మంగళగిరి టౌన్ : జాతీయ స్థాయిలో ఈ నెల 22 నుంచి 30వ తేదీ వరకు కర్ణాటక రాష్ట్రం దావనగిరిలో జరుగుతున్న జూనియర్ నేషనల్ ఎక్యూప్డ్ ఉమెన్ పవర్‌లిఫ్టింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారిణి ప్రతిభ చాటినట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు విజయభాస్కరరావు, షేక్ సందాని శనివారం తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తరఫున గుంటూరు జిల్లా తెనాలికి చెందిన షేక్ షబీనా 84 కిలోల విభాగంలో పాల్గొని కాంస్య పతకం సాధించినట్లు తెలిపారు. స్క్వాట్ 202.5 కిలోలు, బెంచ్ ప్రెస్ 97.5 కిలోలు, డెడ్ లిఫ్ట్ 182.5 కిలోలు, ఓవరాల్ 482.5 కిలోల విభాగాల్లో కాంస్య పతకాలు సాధించినట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 514.20 అడుగుల వద్ద ఉంది. ఇది 138.9118 టీఎంసీలకు సమానం.

సచివాలయ ఉద్యోగుల్లో ట్రాన్స్‘ఫియర్’

- ఖాళీలు చూపించకుండా బదిలీలు ప్రక్రియ చేపట్టిన అధికారులు
- ఆప్షన్ ఫాం ఇచ్చి వెళ్లిపోవాలని సూచన
- 30న సచివాలయం ఎలాట్‌మెంటు
- అధికారుల తీరుపై సచివాలయ ఉద్యోగుల మండిపాటు



కౌన్సెలింగ్ విధి విధానాలను వివరిస్తున్న అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు



సచివాలయ ఉద్యోగుల నుంచి ఆప్షన్ ఫాం తీసుకుంటున్న ఉద్యోగులు

నెహ్రూనగర్: సచివాలయ ఉద్యోగుల బదిలీల కౌన్సెలింగ్‌లో అధికారులు పారదర్శకతకు పాతర వేశారు. అసలు ఖాళీలు చూపించకుండానే నిర్వహించడంపై ఉద్యోగులు మండిపడుతున్నారు. ఉమ్మడి గుంటూరు జిల్లా పరిధిలోని యూఎల్‌బీస్(అర్బన్ లోకల్ బాడీస్) అయిన గుంటూరు నగరపాలక సంస్థ, మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్, తెనాలి, నరసరావుపేట, బాపట్ల, పొన్నూరు, రేపల్లె, సత్తెనపల్లి, వినుకొండ, పిడుగురాళ్ల, మాచర్ల, దాచేపల్లి, చిలకలూరిపేట, గురజాల మున్సిపాలిటీల పరిధిలోని వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న సిబ్బందికి బదిలీల కౌన్సెలింగ్ గుంటూరు నగరంలోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో శనివారం జరిగింది. ఇందులో వార్డు అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీ, వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ సెక్రటరీ, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు ఉన్నారు.

పారదర్శకతకు పాతర

మామూలుగా ఉద్యోగుల బదిలీలకు సంబంధించిన కౌన్సెలింగ్ ప్రక్రియ ఖాళీలను బట్టి నడుస్తుంది. ముందుగా దివ్యాంగులకు, విజువల్లీ చాలెంజెడ్, క్యాన్సర్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ వంటి ఆపరేషన్లు చేసుకున్న వారికి ప్రాధాన్యం ఉంటుంది. ఆ తర్వాత సీనియార్టీ, ర్యాంక్‌ని బట్టి ఉంటుంది. అయితే, అధికారులు ఇవేమీ పాటించలేదు. సచివాలయ వివరాలను మూడు ఆప్షన్స్‌గా చూపించి, ఫారం ఫిల్ చేసి ఇచ్చేసి వెళ్లిపోండంటూ చెప్పడంతో ఉద్యోగులు విస్తుపోయారు. ఈ నెల 30వ తేదీలోగా అలాట్ అయిన సచివాలయానికి సంబంధించిన పోస్టింగ్ కేటాయిస్తామని చెప్పడంతో ఖంగుతిన్నారు. అసలు తాము ఇచ్చిన ఆప్షన్స్ ఫాం అయిన ఉంటుందా ? లేక చెత్త బుట్టలో వేస్తారో ! అని ఒకింత అనుమానం వ్యక్తం చేశారు.

వార్డు టూ వార్డు ట్రాన్స్‌ఫర్లపై మండిపాటు

వార్డు టూ వార్డు సచివాలయానికి మాత్రమే ట్రాన్స్‌ఫర్ అయ్యే విధంగా ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంపై సచివాలయ ఉద్యోగులు మండిపడుతున్నారు. ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న వారికి తప్పనిసరిగా యూఎల్‌బీ టూ యూఎల్‌బీ(అర్బన్ లోకల్ బాడీ)కు ట్రాన్స్‌ఫర్ చేసుకునే అవకాశం కల్పించి ఉంటే బాగుండేదని కొంత మంది మహిళా సచివాలయ ఉద్యోగులు పేర్కొన్నారు. వార్డు టూ వార్డు పెట్టుకోవడం ద్వారా ఇంకా దాన్ని ట్రాన్ఫర్లు అనడం ఎందుకని ప్రశ్నిస్తున్నారు.

ఎమ్మెల్యేల లెటర్లకే ప్రాధాన్యం ?

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వార్డు సచివాలయాల్లో ఉద్యోగాలకు సంబంధించి రిక్రూట్‌మెంట్ గత ప్రభుత్వ హయాంలో రెండు సార్లు జరిగింది. ఇందులో ఉమ్మడి గుంటూరు జిల్లాకు 11,082(అర్బన్, రూరల్‌లకు కలిపి) మంది సెక్రటరీలు ఎంపికయ్యారు. వీరిలో మొదటి బ్యాచ్‌కు పోస్టింగ్స్‌లో ప్రాధాన్యత ఇవ్వాలి. అయితే, పలువురు ఒకే సచివాలయానికి ఇద్దరు, ముగ్గురు ఎమ్మెల్యేల దగ్గర నుంచి సిఫార్సుల లెటర్లు తీసుకు రావడంతో గందరగోళం నెలకొంది. ఎమ్మెల్యేలు ఇచ్చిన లెటర్లే ఆధారంగా బదిలీలు జరిగే అవకాశం ఉందంటూ కొంత మంది సీనియర్ సచివాలయ ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందించి బదిలీల ప్రక్రియ నిర్వహిస్తారో ఈ నెలాఖరు వరకు వేచి చూడాల్సిందేనని సచివాలయ ఉద్యోగులు మిన్నకుండిపోయారు.

అయితానగర్‌ను భయపెట్టేందుకే దాడి



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మస్తాన్‌వలి



సదస్సుకు హాజరైన ప్రజానీకం

- మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో వక్తలు
- పోలీసుల తీరు, సమర్థిస్తున్న పాలకుల వైఖరిపై ఆగ్రహం
- తీవ్రంగా ఖండించిన రాజకీయ పార్టీలు, దళిత, ప్రజా సంఘాల రాష్ట్ర నేతలు

తెనాలి: పాలకులు పోలీస్ యంత్రాంగాన్ని గుప్పిట పెట్టుకుని ఎప్పుడు.. ఎవరిని వేధించాలని చూస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో ప్రత్యామ్నాయ దృక్పథాన్ని, సంస్కృతిని తీసుకురావాలని, ప్రశ్నించే తత్వానికి ఈ సదస్సు వేదిక కావాలని శనివారం రాత్రి తెనాలిలో జరిగిన మానవ హక్కుల పరిరక్షణ సదస్సులో పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. దళిత చైతన్యానికి, ఉద్యమాలకు గుండెకాయ వంటి అయితానగర్‌ను భయభ్రాంతులకు గురిచేసేందుకు యువకులపై బహిరంగ దాడి చేశారని ఆరోపించారు. పోలీసుల తీరునూ, వారిని సమర్థిస్తున్న పాలకుల వైఖరిని తీవ్రంగా ఖండించారు. న్యాయం జరిగే వరకు పోరాడాల్సిందేనని స్పష్టం చేశారు. తెనాలిలో ముగ్గురు దళిత, మైనారిటీ యువకులపై బహిరంగంగా థర్డ్ డిగ్రీ ప్రయోగించిన పోలీసుల అరాచకాన్ని, మానవ హక్కుల ఉల్లంఘనను నిలదీస్తూ తెనాలి అయితానగర్‌లోని కమ్యూనిటీ హాలులో జరిగిన సదస్సుకు సమన్వయకర్త పిల్లి విద్యాసాగర్ అధ్యక్షత వహించారు. రాజకీయ పార్టీలు, వివిధ దళిత, ప్రజాసంఘాలు మొత్తం 24 పైగా నిర్వాహక కమిటీగా జరిపిన సదస్సులో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పోలీసులే కేసు పెట్టి, తీర్పులిచ్చి, శిక్షలు వేసేస్తుండటం దారుణమని పేర్కొన్నారు. తెనాలి పోలీసుల మానవ హక్కుల ఉల్లంఘనను సీపీఎం ఖండిస్తోందని తెలిపారు. మానవ హక్కులను కాపాడుకోవడమే మనముందున్న సమస్యగా స్పష్టం చేశారు.

- సీపీఐ రాష్ట్ర నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ మాట్లాడుతూ తెనాలి పోలీసుల దారుణంపై ప్రజాప్రతినిధులు, చివరికి హోం మంత్రి సహా సిగ్గుపడకపోగా సమర్థిస్తారా? అంటూ నిలదీశారు.
- కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ ఎమ్మెల్యే షేక్ మస్తాన్‌వలి మాట్లాడుతూ పోలీసులు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని బహిరంగంగా శిక్షించమని ఏ చట్టం చెబుతోందని అన్నారు.
- ఎస్సీ కమిషన్ మాజీ చైర్మన్ ఎం.విక్టర్ ప్రసాద్ మాట్లాడుతూ తెనాలిలో దళిత, మైనారిటీ యువకులపై కానిస్టేబుల్ చేసిన ఫిర్యాదు, వాస్తవంగా పెట్టీ కేసు మాత్రమేనని తెలిపారు. దీనిపై పలు సెక్షన్లతో కేసులు పెట్టటం ఏమిటని ప్రశ్నించారు.
- రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు మాట్లాడుతూ అయితానగర్‌లో అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుతోనే కుట్ర మొదలైందని చెబుతూ అందుకే సుప్రీం కోర్టులో దాఖలు చేసిన పిటిషనులో స్థానిక ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్ పేరును చేర్చినట్టు తెలిపారు.
- ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ దళితులు ఐకమత్యంగా పోరాటం చేసి ఆత్మగౌరవాన్ని కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.
- విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి దయాసాగర్ మాట్లాడుతూ తెనాలి పోలీసుల చర్య కచ్చితంగా మానవ హక్కుల ఉల్లంఘనేనని చెప్పారు.
- వీసీకే పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్‌జే సాగర్ మాట్లాడుతూ పోలీసుల దాడివెనుక పోరాట స్ఫూర్తి కలిగిన అయితానగర్‌ను భయభ్రాంతులను చేయాలనే పాలకుల కుట్ర ఉందని తెలిపారు.
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు అన్నవరపు కిశోర్ మాట్లాడుతూ ఇంత ఆందోళన జరిగినా కనీసం పోలీసులపై చర్య తీసుకోలేదంటే దళితులపై ప్రభుత్వ చులకనభావమేనని పేర్కొన్నారు.
- సభాధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ అతి త్వరలోనే ఈ కేసుకు సంబంధించిన కీలక సాక్ష్యాలను బహిర్గతం చేస్తామని వెల్లడించారు.

ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ నేత జి.శాంతకుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర సమన్వయకర్త ఉమామహేశ్వరరావు, సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి వై.నేతాజీ, జనచైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వి.లక్ష్మణరెడ్డి, మహిళా సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకురాలు సుంకర పద్మశ్రీ , కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి ఆంద్ర మాల్యాద్రి, మాల ఉద్యోగుల సంఘం నేత కిశోర్‌బాబు, కులనిర్మూలన సమితి రాష్ట్ర కార్యదర్శి కె.కృష్ణ, ఇండియన్ లీగల్ ప్రోగ్రెసివ్ అసోసియేషన్ నేత మణి, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు చిలకా చంద్రశేఖర్, భగత్‌సింగ్, వేముల మురళి, నీలాంబరం, ఓపీడీఆర్ రాష్ట్ర అధ్యక్షుడు చావలి సుధాకర్, దళిత హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు నాగేంద్రం, ఆర్‌పీఐ అంబేడ్కరైట్ రాష్ట్ర అధ్యక్షుడు పి.రవిప్రసాద్, తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ మాట్లాడారు. దళిత బహుజన ఫ్రంట్ కొరివి వినయ్‌కుమార్ స్వాగతం పలికారు.

అమ్మవారికి ఆషాఢ సారె



గుంటూరు ఎస్‌వీఎన్ కాలనీలోని పద్మావతి గోదా సమేత వేంకటేశ్వరస్వామి వారి దేవస్థాన భక్త బృందం శనివారం అమ్మవారికి ఆషాఢ సారె సమర్పించారు. కోలాట ప్రదర్శన చేస్తూ ఆలయానికి చేరుకుని సారె సమర్పించారు.
– నగరంపాలెం(గుంటూరు వెస్ట్)

భారీగా ఉద్యాన సహాయకుల బదిలీలు

నరసరావుపేట: ఉమ్మడి గుంటూరు జిల్లాలో గత ఐదేళ్ల నుంచి పని చేస్తున్న గ్రామ ఉద్యాన సహాయకులకు శనివారం పట్టణంలోని మున్సిపల్ అతిథి గృహంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. గుంటూరు ఉద్యానశాఖ డిప్యూటీ డైరెక్టర్ బి.రవీంద్రబాబు, పల్నాడు, బాపట్ల జిల్లాల ఉద్యానశాఖ అధికార్లు ఐ.వెంకటరావు, ఎస్‌ఎంఎ కరీం ఆధ్వర్యంలో 162మందిని బదిలీ చేశారు. కార్యక్రమంలో మూడు జిల్లాల ఉద్యాన అధికారులు పాల్గొన్నారు.

ప్రత్యేక పీజీఆర్ఎస్‌కు 20 అర్జీలు



అర్జీ స్వీకరించి సమస్య వింటున్న డీఆర్ఓ మురళి

నరసరావుపేట: ఎస్సీ, ఎస్టీల ప్రత్యేక ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో వచ్చిన అర్జీలను వెంటనే పరిష్కరించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఏకా మురళి అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు ఆయన అధ్యక్షత వహించి జిల్లా నలుమూలల నుంచి వచ్చిన వారిచే 20 అర్జీలు స్వీకరించారు. సంబంధిత శాఖలకు ఆయా ఫిర్యాదులను అందజేసి సమస్యలను వెంటనే పరిష్కరించవలసిందిగా ఆదేశాలు జారీ చేశారు.

- సమస్య తెలియజేసేందుకు పట్టణంలోని బాబాపేట నుంచి ఓ దివ్యాంగురాలు రాగా ఆర్డీఓ ఆమె వద్దకు వచ్చి సమస్య తెలుసుకున్నారు. తాను 90శాతంకు పైగా దివ్యాంగతనంతో ఉన్నానని తనకు ప్రస్తుతం రూ.6వేలు మాత్రమే ఇస్తున్నారని, తనకు రూ.15వేలు పింఛన్ అమలుచేయాలని కోరారు. సమస్యను పరిశీలించాల్సిందిగా డీఎంహెచ్ఓ డాక్టర్ బి.రవి, డీఆర్డీఏ పీడీ ఝాన్సీరాణిని కోరారు. డీఆర్ఓ మాట్లాడుతూ జిల్లాలో వెనుకబడిన వర్గాలవారి సమస్యల కోసం ప్రత్యేకంగా చొరవ తీసుకోని ప్రతి నెల నాల్గవ శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అభినవ వ్యాసుడు మల్లాది చంద్రశేఖరశాస్త్రి

ప్రవచన కర్త నోరి నారాయణ మూర్తి



మల్లాది చంద్రశేఖర శాస్త్రి శతజయంతి వర్ష సభలో పాల్గొన్న ప్రవచన కర్త నోరి నారాయణ మూర్తి, తదితరులు

అమరావతి: ప్రపంచానికి పురాణాలను అందించింది వేదవ్యాస భగవానుడైతే ఆ పురాణాలను సామాన్యుడికి సైతం అర్థమయ్యే రీతిలో ప్రవచించిన అభినవ వ్యాసుడు పురాణ ప్రవచన సార్వభౌముడు, కీర్తిశేషులు మల్లాది చంద్రశేఖర శాస్త్రి అని ప్రముఖ ప్రవచన కర్త నోరి నారాయణమూర్తి అన్నారు. శనివారం రాత్రి స్థానిక యోగాశ్రమంలో మల్లాది చంద్రశేఖర శాస్త్రి శతజయంతి వర్ష సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఈసభకు మల్లాది రామనాథశర్మ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా నోరి నారాయణమూర్తి మాట్లాడుతూ దేశ, విదేశాలలో పురాణప్రవచనం అనగానే ప్రతి ఒక్కరికీ ముందుగా గుర్తుకు వచ్చేది అభినవ వ్యాస బిరుదాంకితులు మల్లాది చంద్రశేఖరశాస్త్రి మాత్రమేనన్నారు. ఆయన స్వరంలోని మాధుర్యం, రామాయణ, భారత, భాగవతాలపై ఆయనకున్న పట్టువల్ల పురాణ ప్రవచన ప్రముఖుల్లో ప్రథములుగా గుర్తించబడ్డారన్నారు. నాటి కిరోసిన్ దీపాల వెలుగులో పురాణం చెప్పేరోజులనుంచి నేటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మితమైన ఆడిటోరియంలో చెప్పే వరకు సమారు 70 సంవత్సరాల మల్లాదివారి సుదీర్ఘ ప్రవచన ప్రయాణం సాగిందన్నారు.

- శనగవరపు రామ్మోహన శర్మ మాట్లాడుతూ ప్రపంచ ప్రఖాతి గాంచిన శైవ క్షేత్రమైన అమరారామంలో జన్మించిన మల్లాది చంద్రశేఖర శాస్త్రి అమరావతి ఆణిముత్యమన్నారు.
- మాచిరాజు వేణుగోపాల్ మాట్లాడుతూ అమరావతిలోనే చంద్రశేఖర శాస్త్రి బాల్య విద్యాభ్యాసం గడవడంతోపాటు, తొలిరోజుల పురాణ ప్రవచనం ఇక్కడే చేసి, ప్రపంచ వ్యాప్తంగా అమరావతికి మరోసారి వన్నె తెచ్చారన్నారు.
- ప్రముఖప్రవచనకర్త పుల్లాభట్ల వేంకటేశ్వర్లు మాట్లాడుతూ భగవంతుని అనుగ్రహంతో శృంగేరి శారదాపీఠం, తిరుమల తిరుపతి దేవస్థాన ఆస్థాన పండితుడిగా పురాణాలను సామాన్యులకు సైతం అర్థమయ్యే రీతిలో భక్తిభావతత్పరతను ప్రజల్లోకి తీసుకెళ్లిన మహనీయుడు చంద్రశేఖరశాస్త్రి అన్నారు. రెండు తెలుగు రాష్ట్రాలలో ప్రవచనం అంటే ముందుగా గుర్తుకు వచ్చేది చంద్రశేఖరశాస్త్రి అనటంలో అతిశయోక్తి లేదన్నారు. విశ్రాంత న్యాయమూర్తి మందాడి చలపతిరావు, మల్లాది రామచంద్ర శర్మ, అఖిల భారత బ్రాహ్మణ మహాసంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కౌశిక ప్రసాద్‌లు మాట్లాడారు. ఈసభకు అమరావతి చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి




నెహ్రూ బొమ్మ సెంటరులో నిరసన తెలుపుతున్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

రేపల్లె: తమకు ప్రభుత్వ సంక్షేమ పథకాలతోపాటు తల్లికి వందనం కూడా వర్తింపజేయాలని మున్సిపల్ ఇంజినీరింగ్ అండ్ వర్కర్స్ యూనియన్ రేపల్లె కమిటీ అధ్యక్షుడు డి.ప్రభాకరరావు డిమాండ్ చేశారు. మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని యూనియన్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న నిరసనలో భాగంగా శనివారం నెహ్రూ బొమ్మ సెంటరులో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా కార్పొరేషన్‌లు, మున్సిపాలిటీలలో విధులు నిర్వహిస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించటంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందన్నారు. చాలీచాలని వేతనాలతో కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అరకొర జీతాలను అందిస్తూ ప్రభుత్వ ఉద్యోగులుగా పేర్కొంటూ కార్మికులను పథకాలకు దూరం చేస్తున్నారని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం, 12వ పీఆర్సీ అమలుకు అనుగుణంగా కార్మికులకు న్యాయం చేయాలన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే రాష్ట్ర వ్యాప్త ఉద్యమానికి సిద్ధం అవుతామని వెల్లడించారు. కార్యక్రమంలో సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్, యూనియన్ నాయకులు రవి, రాఘవేంద్రరావు, శివ, యువరాజు, తదితరులు పాల్గొన్నారు.

కుట్రదారుల పాలిట సింహస్వప్నం వైఎస్ జగన్

సోషల్ మీడియా యాక్టివిస్ట్ ఈదర గోపీచంద్



నరసరావుపేట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి భూతమని ఒక కొత్త పేరు పెట్టి, ఆ భూతాన్ని భూస్థాపితం చేసేపనిలో ఉన్నామని నాలుగోసారి ముఖ్యమంత్రిగా వ్యవహరిస్తున్న చంద్రబాబునాయుడు నేరపూరితంగా, సంస్కారహీనంగా మాట్లాడటం.. దానికి తానా తందానా అంటూ అనుకూల మీడియా వంతపాడడం, భూస్థాపితం ఎప్పుడు చేస్తారు, ఈ ఐదేళ్లలోనేనా అని పాత్రికేయతకే మచ్చతెచ్చేలాగా ఆ మీడియా ప్రశ్నించడం చాలా అభ్యంతరకరం, ప్రజాస్వామ్య స్ఫూర్తికి కళంకమని సోషల్ యాక్టివిస్టు ఈదర గోపీచంద్ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం పత్రికలకు ఒక ప్రకటన విడుదల చేశారు. అధికారంలో ఉండగా తాను ప్రజలకిచ్చిన ఎన్నికల వాగ్దానం ప్రకారం నవరత్న సంక్షేమ పథకాలను తంతనుగా ఐదేళ్లు అందించడమే కాక, చరిత్రలో నిలిచిపోయే పలు అభివృద్ధి కార్యక్రమాలను చేసి చూపిన ఘనత వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. గత ఐదేళ్లుగా ఆయన్ను విధ్వంసకారుడు అని తమ అనుకూల మీడియా ద్వారా కూటమి నేతలు దుష్ప్రచారం చేశారని మండిపడ్డారు. కూటమి పేరిట అనైతిక పొత్తులు పెట్టుకుని, ఈవీఎంలతో సహా వ్యవస్థలను మేనేజ్ చేసి, గెలిచిన గెలుపూ ఒక గెలుపేనా అని ప్రజలు ప్రశ్నిస్తున్నారని తెలిపారు.

ఇకనైనా బాబు బుద్ధి తెచ్చుకోవాలి

మరో పక్క వైఎస్ జగన్ ఓడినప్పటికీ నీతికి నిలబడి గెలిచాడని, కోట్లాది జన హృదయాలలో నిలిచాడన్నారు. అందుకనే వైఎస్ జగన్ కుట్రదారుల పాలిట సింహ స్వప్నమయ్యాడని తెలిపారు. 164 సీట్లు సాధించినా కూటమి నాయకులకు మనశ్శాంతి కరువైందన్నారు. పెట్టుబడుల సదస్సుల్లో కూడా వైఎస్ జగన్‌పై నిందలు వేయటం వారి కుసంస్కారానికి నిదర్శనమన్నారు. ర్యాలీ ప్రమాదంలో సింగయ్య మరణాన్ని ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్‌తో కల్పించిన ఫేక్ వీడియోతో జగన్‌పైకి నెట్టి, జైలుపాలు చేయాలని చూడటం నీచ నికృష్ట రాజకీయానికి నిదర్శనమన్నారు. ఈ సందర్భంగా హైకోర్టు వేసిన మొట్టికాయలకైనా బాబు బుద్ధి తెచ్చుకుని కక్షపూరిత రాజకీయాలకు, రెడ్‌బుక్ రౌడీయిజానికి స్వస్తి చెప్పి, మొదటి ఏడాది బాకీపడ్డ సూపర్‌సిక్స్ పథకాలను వడ్డీతో సహా ప్రజలకు అందజేయాల్సిందిగా డిమాండ్ చేశారు.

మేలు రకం విత్తనాలతో మిరపసాగు

జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు



మాట్లాడుతున్న జిల్లా ఉద్యాన అధికారి

నరసరావుపేట రూరల్: మేలు రకపు విత్తనాలతో మిరప సాగును రైతులు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి ఐ.వెంకట్రావు తెలిపారు. మిరప పంటపై జిల్లాలోని ఉద్యాన సహాయకులకు మున్సిపల్ సమావేశ మందిరంలో శనివారం శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వెంకట్రావు మాట్లాడుతూ భూమిలో కర్బన శాతం పెంచే విధంగా జీలుగ, జనుము విత్తనాలను, పశువుల ఎరువును వేయాలని సూచించారు. నేలను లోతుగా దుక్కులను దున్నడం వలన చీడపీడలను నివారించవచ్చని తెలిపారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ నగేష్ జిల్లాలో సాగు చేసేందుకు అనువైన మిరప రకాలను తెలియజేశారు. ఎల్‌సీఏ-643 నల్లతామర పురుగు ఉధృతిని తట్టుకుంటుందని తెలిపారు. ఎల్‌సీఏ 334 ఎగుమతికి అనువైన రకమని వివరించారు. ఎల్‌సీఏ 353,ఎల్‌సీఏ 625, ఎల్‌సీఏ 680,ఎల్‌సీఏ 684, ఎల్‌సీఏ 657 రకం విత్తనాలను రైతులు సాగు చేయాలని తెలిపారు. నారు పెంచేందుకు సెంటుకు 650గ్రాములు, ఎదబెట్టేందుకు ఎకరానికి రెండున్నర కిలోల విత్తనం అవసరమవుతుదని తెలిపారు. సంకర రకాలైతే ఎకరానికి 80 నుంచి 100 గ్రాముల విత్తనం సరిపోతుందన్నారు. డిజిటల్ గ్రీన్ కో-ఆర్డినేటర్ మస్తాన్‌వలి మాట్లాడుతూ మిరప సాగు చేసే రైతులు ఈ-మిర్చి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని రైతు వివరాలు నమోదు చేయడం ద్వారా వ్యవసాయ అనుబంధ సేవలకు చెందిన ప్రశ్నలకు సమాధానాలు పొందవచ్చని తెలిపారు. ఉద్యాన అధికారులు ఎస్‌కె నబీరసూల్, మోహన్, సురేష్, అంజలిభాయ్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు అవసరం

డీఎంహెచ్ఓ డాక్టర్ రవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ

నరసరావుపేట: నీళ్లు, దోమల ద్వారా వచ్చే వ్యాధుల విషయంలో అత్యంత అప్రమత్తంగా ఉంటూ అవి ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ బి.రవి ఆరోగ్య కార్యకర్తలకు సూచించారు. శనివారం తన కార్యాలయంలో జిల్లా మలేరియా అధికారి కె.రవీంద్ర రత్నాకర్ అధ్యక్షతన జిల్లాలోని పీహెచ్‌సీలు, యూపీహెచ్‌సీలు, సబ్ యూనిట్లలో నూతనంగా చేరిన 65మంది ఆరోగ్య కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వారికి కేటాయించిన ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వ్యాధులు సంభవిస్తే తక్షణమే పై అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు, ఎంఎల్‌హెచ్‌పీలకు సహాయ సహకారాలు అందజేస్తూ బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహించాలని కోరారు. రవీంద్ర రత్నాకర్ మాట్లాడుతూ నవంబరు వరకు మలేరియా, డెంగీ, చికున్‌గున్యా, ఫైలేరియా, మెదడువాపు వ్యాధులు లాంటి సీజనల్ వ్యాధులు విషయంలో ఫ్రైడే డ్రైడేను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. దోమల నిర్మూలనతో పాటు అవి పుట్టకుండా, కుట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. డాక్టర్ నజీరు, ఏఎంఓ చుక్కా వెంకటేశ్వర్లు, కుంచాల శ్రీనివాసరావు, సబ్‌యూనిట్ అధికారులు పాల్గొన్నారు.

గ్రావెల్ లారీలను అడ్డుకున్న జనసేన నాయకులు

అధికారుల సహకారంతోనే అక్రమ మైనింగ్ అంటూ ఆరోపణ



లారీని అడ్డుకుంటున్న జనసేన నాయకుడు

చిలకలూరిపేట: అటవీ, అసైన్డ్ భూములను అక్రమంగా తవ్వి దోపిడీకి పాల్పడుతుంటే, సంబంధిత అధికారులు నిద్ర నటిస్తున్నారని... మామూళ్ల మత్తులో వారు జోగుతున్నారని ఉమ్మడి గుంటూరు జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. యడ్లపాడు మండలం వంకాయలపాడు, చెంఘీజ్‌ఖాన్‌పేట పంచాయతీల మధ్య అటవీ, అసైన్డ్ భూముల్లో కొంతమంది అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ గ్రావెల్ తరలించుకుపోతున్నారని స్థానికులు చేసిన ఫిర్యాదు మేరకు జనసేన నాయకులు ఆ ప్రాంతాన్ని శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రావెల్ తరలించుకుపోతున్న మూడు టిప్పర్ లారీలను అడ్డుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ తమ పార్టీ కూటమి ప్రభుత్వంలో భాగస్వామి అయినప్పటికీ తాము అవినీతిని అడ్డుకుంటామని వెల్లడించారు. ఆరు పొక్లెయిన్‌లు, 15 టిప్పర్ లారీలతో అటవీ, ప్రభుత్వ భూముల్లో భారీగా గ్రావెల్ అక్రమ తవ్వకాలకు, దోపిడీకి పాల్పడుతున్నారని వివరించారు. జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేస్తే తహసీల్దార్‌ను పంపిస్తానని చెప్పారని, తహసీల్దార్‌కు ఫోన్ చేస్తే 10 నిమిషాల్లో వస్తానని, సంబంధిత లారీల తాళాలు తీసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. లారీల తాళాలు తీసుకొని 3గంటలు వేచి చూసినా తహసీల్దార్ రాకుండా కేవలం ఒక వీఆర్వోను పంపించి నిర్లక్ష్యంగా వ్యవహరించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లి సంబంధిత వ్యక్తులు, అధికారులపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. అడ్డుకున్న మూడు టిప్పర్ లారీల తాళాలను మీడియా సమక్షంలో వీఆర్వోకు అందజేశారు. కార్యక్రమంలో జనసేన చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్త తోట రాజారమేష్, జిల్లా సంయుక్త కార్యదర్శి సుభాని, నాయకులు ఖాదర్‌బాషా, మునీర్ హసన్, మేకల రామారావు, దరదాసుల శరత్, బాపన హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్ రవాణా చేస్తున్న ఇద్దరు అరెస్ట్



చిలకలూరిపేట టౌన్: డ్రగ్స్ అక్రమంగా రవాణా చేస్తున్న ఇద్దరిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు నగరానికి చెందిన చల్లా గోపి, షేక్ షారూక్ 25 గ్రాముల డ్రగ్స్‌తో శుక్రవారం మండల పరిధిలో ఓ రెస్టారెంట్ వద్దకు చేరుకున్నారు. అక్కడ అనుమానాస్పదంగా సంచరిస్తున్నారన్న సమాచారంతో అర్బన్ ఎస్ఐ చెన్నకేశవులు ఇరువురిని తనిఖీ చేసి రూరల్ పోలీసులకు అప్పగించారు. శనివారం రూరల్ సీఐ సుబ్బనాయుడు ఇరువురిని అదుపులోకి తీసుకుని డ్రగ్స్ స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం

ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి ఉమామహేశ్వరరావు



తాడేపల్లి రూరల్ : రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని ఏపీ మున్సిపల్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి కె. ఉమామహేశ్వరరావు అన్నారు. తాడేపల్లి పట్టణ పరిధిలోని ముత్యాలనగర్‌లో శనివారం మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా కార్మికులకు జీతాలు పెరగక, పెరిగిన ధరలతో అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం 18,500 రూపాయలు జీతం ఇవ్వాలని, వారాంతపు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. జూలై 1న అన్ని పట్టణాలలో మున్సిపల్ కార్మికులతో కళ్లకు గంతలు కట్టి నిరసన కార్యక్రమాన్ని చేపట్టనున్నామని వెల్లడించారు. జూలై 4న ధర్నా చౌక్‌లో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులతో పెద్దఎత్తున ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ తాడేపల్లి పట్టణ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్లు పాల్గొన్నారు.

గెస్ట్ ఫ్యాకల్టీల తొలగింపు అన్యాయం

మాచర్ల: మండలంలోని విజయపురిసౌత్‌లోని ఏపీ ఆర్‌జేసీలో గత 15 ఏళ్లుగా పనిచేస్తున్న తమను జూన్ 1న ఉన్నపళంగా తొలగించారని ఫ్యాకల్టీ గెస్ట్ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తొలగింపునకు గురైన ఏడుగురు గెస్ట్ అధ్యాపకులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత 15 సంవత్సరాలుగా ఫ్యాకల్టీ అధ్యాపకులుగా పనిచేస్తున్న తమను ఆకస్మికంగా తొలగించడం సరికాదన్నారు. కళాశాల ప్రిన్సిపాల్‌గా నూతనంగా బాధ్యతలు చేపట్టిన సరోజిని ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా అకారణంగా తమను తొలగించారన్నారు. దీనిపై ప్రిన్సిపాల్‌కు వినతి పత్రం అందజేసి తమను విధుల్లోకి తీసుకోవాలని కోరామన్నారు. అయినా స్పందించకుండా నూతన అధ్యాపకులను నియమించారని ఆరోపించారు. తామంతా 15 సంవత్సరాలుగా రూ.18వేల వేతనంతో పనిచేస్తున్నామన్నారు. తొలగింపుతో తమ కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. కొత్తగా నోటిఫికేషన్ ఇచ్చి కొత్తవారిని నియమించడం సరికాదన్నారు. తమకు న్యాయం చేయాలని ఉన్నతాధికారులను కలిసి విన్నవిస్తామని తెలిపారు. సమావేశంలో గెస్ట్ అధ్యాపకులు డి.వీరేష్, టి.మధు, శ్రీనునాయక్, రమేష్, సునీత తదితరులు పాల్గొన్నారు.

శాంతియుత వాతావరణం కోసమే పల్లె నిద్ర

రేపల్లె: శాంతియుత వాతావరణం నెలకొల్పి ప్రజలతో మమేకం అయ్యేందుకు పల్లె నిద్ర కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రేపల్లె డీఎస్పీ ఆవుల శ్రీనివాసరావు చెప్పారు. పల్లె నిద్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం రాత్రి పట్టణంలోని 16వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వార్డులో సమస్యలు తలెత్తితే శాంతియుతంగా పరిష్కరించుకోవాలన్నారు. వివాదాస్పదమైన అంశాలు తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. అనుమానాస్పద స్థితిలో ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే పోలీసులకు తెలపాలన్నారు. సీఐ మల్లికార్జునరావు, ఎస్ఐ రాజశేఖర్ పాల్గొన్నారు.